క్లుప్తంగా

వెంకటేశ్వరరావు కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



కోడూరు: మండలంలోని ఉల్లిపాలెం గ్రామానికి చెందిన చెక్కా వెంకటేశ్వరరావు (52) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆదివారం ఉల్లిపాలెంలో వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకొని, వారికి సానుభూతి తెలిపారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పరిశె మాధవరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్‌పర్సన్లు కటకం కుటుంబరావు, కొక్కిలిగడ్డ శ్రీమన్నారాయణ, నేతలు వెర్రీ శ్రీనివాసరావు, కోలా గోపి, తదితరులు పాల్గొన్నారు.

సాగర తీరంలో మెరైన్ పోలీసుల గస్తీ



కోడూరు: హంసలదీవి సాగరతీరంలో పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు ప్రత్యేక గస్తీ నిర్వహించారు. బీచ్ వద్ద సముద్రంలో గుంతలు ఏర్పడడంతో పర్యాటకులను అప్రమత్తం చేశారు. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన యాత్రికులు తీరానికి తరలివచ్చారు. వీరంతా సముద్ర అలల మధ్య కేరింతలు కొడుతూ సందడి చేశారు. సముద్ర పరిస్థితులు భిన్నంగా ఉండడంతో మెరైన్ పోలీసులు లౌడ్‌స్పీకర్ల ద్వారా హెచ్చరికలు చేశారు. పర్యాటకులకు అవగాహన కల్పించారు. బీచ్ వద్ద నుంచి సాగర సంగమం వరకు గస్తీ చేపట్టారు. ఎస్ఐలు, పూర్ణమాధురి, ఉజ్వల్‌కుమార్, ఏఎస్ఐ పోతురాజు, రైటర్ రెహమాన్ జానీ, సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు ఉల్లాస్ పరీక్ష



కొడాలి(ఘంటసాల): నిరక్షరాస్యులైన డ్వాక్రా మహిళలకు వయోజన విద్యా శాఖ ద్వారా అందిస్తున్న ప్రాథమిక అక్షరాస్యత కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పలువురు పేర్కొన్నారు. మండలంలోని కొడాలి గ్రామంలో వయోజన విద్యాశాఖ ద్వారా డ్వాక్రా మహిళలకు ఉల్లాస్ 2024– 25 పేరుతో విద్యనందిస్తున్నారు. గత కొన్ని రోజులుగా శిక్షణ పొందుతున్న మహిళల సామర్థ్యలను పరీక్షించేందుకు అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం ఉల్లాస్ పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త దొండపాటి మణికుమారి, వీఏఏ కొల్లూరి నాని, భవిత డ్వాక్రా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత



గూడూరు: మండల పరిధిలోని కంకటావ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఆంజనేయులు, సముద్రవేణి దంపతులకు అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్) వ్యవస్థాపకుడు డాక్టర్ కొల్లూరి సత్యనారాయణ సాయం అందజేశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆంజనేయులు కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న కొల్లూరి సత్యనారాయణ ఆదివారం ఆ కుటుంబాన్ని సందర్శించి రూ.10 వేలు విలువ చేసి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం అందజేశారు. పక్షవాతానికి సంబంధించి మందులను కూడా అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. అప్స్ వైస్ చైర్మన్ కొల్లూరి రాజా, దావు సోమశేఖర్, కాగిత నాగరాజు, కొండ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

55 మందికి వైద్య పరీక్షలు



చల్లపల్లి: స్థానిక వాసవీ క్లబ్ కార్యాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో 55 మందికి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా హోమియో మందులు అందజేశారు. మచిలీపట్నంకు చెందిన హోమియో వైద్యులు మణికంఠ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు దింటకుర్తి జ్యోతి, అన్నం సత్యవాణి, అమరవాణి, జూపూడి కిరణ్, ఉరిమి సువర్చల తదితరులు పాల్గొన్నారు.

అధికారులూ.. ఇదేం తీరు

- పూర్తికాని పనులకు బిల్లులు..?
- ఎనిమిదేళ్ల కిందట చేపట్టిన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి
- పాత బల్లులు చెల్లింపు చేయాలని కౌన్సిల్ అజెండాలో అంశం
- తిప్పికొట్టిన కౌన్సిల్..
- విమర్శలకు తావిస్తున్న అధికారుల తీరు

పెడన: అవ్వని పనులకు బిల్లులు చెల్లించాలని కౌన్సిల్ ముందు తీర్మానం పెట్టడంపై మున్సిపల్ అధికారుల తీరు విమర్శలకు గురిచేస్తోంది.



2017లో వేసిన మెటల్ రోడ్డు.. (దీనికే ఇప్పుడు సుమారు రూ.4 లక్షలు చెల్లించాలని అజెండాలో పొందుపరిచారు)



జనరల్ ఫండ్స్ నుంచి రూ.2.46 చెల్లించాలని కోరుతున్న కమ్యూనిటీ హాలు భవనం ఇదే

2017లో మెటల్ రోడ్డు నిర్మించామంటూ..

మున్సిపల్ సాధారణ సమావేశం ఈ నెల 15న నిర్వహించారు. ఈ సమావేశం అజెండాలో 2015–16 ఏడాదిలో స్పెషల్ డెవలప్‌మెంట్ గ్రాంటు నిధులతో పట్టణంలోని నాలుగో వార్డులో 2017లో మెటల్ రోడ్డు నిర్మాణం పూర్తయిందని, ఆ నిధులు విడుదల కానందున మున్సిపల్ జనరల్ ఫండ్స్ నుంచి సుమారు రూ.4 లక్షలు చెల్లింపులు చేయాలని మున్సిపల్ అధికారులు 38వ అంశంగా కౌన్సిల్ ముందుకు తీసుకువచ్చారు. అప్పటి కలెక్టర్ ఈ నిధులు విడుదల చేయలేదు. అసలు రోడ్డు నిర్మించారా.. లేదా అనే సందేహాలతో అప్పటి అధికారులు సైతం మిన్నకుండి పోయారు. అధికారం మారింది.. అధికారులు మారారు.. ఇంకేం.. మనం బిల్లులు పెడితే.. పాస్ అయి నగదు వచ్చేస్తోందనుకున్నదే తడవుగా మున్సిపల్ అధికారులను పట్టుకుని అజెండాలో పెట్టి ఆమోదించుకుందామని ఆలోచనలు చేశారు టీడీపీ నాయకులు.

కమ్యూనిటీహాల్ నిర్మాణం విషయంలో..

ఇదే వార్డులో ఉర్దూ మదర్సా కమ్యూనిటీ హాలు నిర్మాణానికి 2014–15లో ఎంపీ నిధులు రూ.5 లక్షలతో నిర్మించాలని తలపెట్టారు. నిధులు కూడా మంజూరయ్యాయి. మొదటి బిల్లు రూ.2.50 లక్షలు చెల్లించారు. మిగిలిన రూ.2.46 లక్షలు బిల్లు చెల్లింపు చేయలేదు. నిధులున్నా డబ్బులు చెల్లించలేదంటే అప్పట్లోనే పనులు పూర్తికాలేదనే విమర్శలున్నాయి. పనులు అసంపూర్తిగా చేసి, పూర్తయినట్లుగా ఎంబుక్‌లు సిద్ధం చేయడం వల్లే నిధులు చెల్లింపులు చేయలేదనే విషయం అందరికీ తెలిసిందే. తాజాగా మళ్లీ ఈ బిల్లులు పెట్టి నిధులు రాబట్టడానికి మున్సిపల్ జనరల్ ఫండ్స్ నుంచి చెల్లించాలని కోరడం, అధికారులు వత్తాసు పలకడంపై కౌన్సిల్ సభ్యులు తీవ్రంగా మండి పడుతున్నారు.



అసంపూర్తి భవనాన్ని పూర్తి చేయండి..

మా వార్డులో ఉర్దూ మదర్సా కమ్యూనిటీ హాలును అసంపూర్తిగా వదిలేశారు. దీనిని మున్సిపల్ జనరల్ ఫండ్స్ నుంచి నిధులు మంజూరు చేసి నిర్మించాలని పలు దఫాలుగా కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చా. మున్సిపల్ జనరల్ ఫండ్స్ నుంచి కమ్యూనిటీ హాలుకు చెల్లింపులు కుదరవని చెప్పారు. ఇప్పుడు అసంపూర్తిగా ఉన్న దానికి మున్సిపల్ జనరల్ ఫండ్స్ నుంచి ఏ విధంగా చెల్లింపులు చేస్తారని అధికారులను నిలదీశా. మెటల్ రోడ్డు నిర్మాణం చేశామంటున్నారు. అసలు రోడ్డు నిర్మాణం సరిగ్గా జరగలేదు. అందుకే అప్పటి నుంచి బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. రోడ్డు, కమ్యూనిటీ హాలు అసంపూర్తిగానే ఉన్నాయి. కానీ పూర్తయినట్లు రికార్డులు చూపి బిల్లులు రాబట్టుకోవాలని చూస్తే ఊరుకునేది లేదు. పనులు పూర్తయ్యాయని రికార్డులు చూసి చెబితే సరిపోతుందా. క్షేత్రస్థాయిలో పరిశీలించరా. పనులు పూర్తయిందీ లేనిది వారికి కనిపించడం లేదా. వాస్తవంగా పూర్తిగా నిర్మించి ఉంటే బిల్లుల చెల్లింపులకు మాకు అభ్యంతరం లేదు. పూర్తికానివాటికి బిల్లులు చెల్లించడానికి అధికారులు సిద్ధమవ్వడం దారుణం.

– రెహమతున్నీసా, నాలుగో వార్డు కౌన్సిలర్, పెడన



బిల్లులు లాప్స్ కావడం వల్ల జాప్యంతో ఇప్పుడు పెట్టాం

అప్పటి పనులకు సంబంధించి ఎంత వరకు పూర్తయ్యాయో అంత వరకు బిల్లులు చెల్లించాలని సదరు కాంట్రాక్టరు కోరడంతో నిబంధనల మేరకు అజెండాలో పొందుపరిచాం. అప్పటి రికార్డుల ప్రకారం ఎంబుక్‌లో కూడా ఎంత పనులు పూర్తయ్యాయనే విషయాలు ఉండటంతో వాటిని పరిశీలించి జనరల్ ఫండ్స్ నుంచి చెల్లింపులు చేయాలని కోరాము. అది కౌన్సిల్ నిర్ణయం. అప్పటి నుంచి బిల్లులు రాకపోవడం అంటే సదరు నిధులు లాప్స్ అయి ఉంటాయి. వెనక్కు మళ్లి ఉండవచ్చు. అందువల్ల జనరల్ ఫండ్స్ నుంచి కోరాము. కౌన్సిల్ వ్యతిరేకించింది. కాబట్టి చెల్లింపులు నిలిచిపోయాయి.

– కె.సీతారామాంజనేయులు, ఏఈ, మున్సిపల్, పెడన

సంపటాలమ్మ గ్రామ సంచారం ప్రారంభం



గ్రామ సంచారానికి బయలుదేరుతున్న సంపటాలమ్మ అమ్మవారు

చల్లపల్లి: గ్రామ దేవత సంపటాలమ్మ తల్లి గ్రామ సంచారం ఆదివారం వైభవంగా ప్రారంభించారు. తొలుత ఆలయ వంశపారంపర్య ప్రధాన అర్చకుడు చల్లపల్లి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఘటం బిందెను ఆలయం నుంచి పడమరవీధిలోని అమ్మవారి పుట్టిల్లు పత్తిపాటి వారి ఇంటికి వెళ్లి బయలుదేరి వెళ్లింది. అమ్మవారి రాకను పురస్కరించుకుని పుట్టింటివారు అమ్మవారికి చీర, పసుపు, కుంకుమ, గాజులతో సారె సమర్పించిన అనంతరం తిరిగి అమ్మవారు ఆలయానికి బయలుదేరి వచ్చారు. ఇక్కడి నుంచి గ్రామ సంచారం ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కోటేశ్వరరావు కుమారులు చల్లపల్లి నరేష్, పూర్ణలు అమ్మవారి ఘటం బిందెను శిరస్సుపై పెట్టుకుని సంచారాన్ని కొనసాగించారు. ఇంటి ముందుకు రాగానే మహిళలు నీరు బిందెలతో వారబోశారు. ఆలయ కమిటీ సభ్యులు, రిటైర్డ్ వీఆర్వో గొర్రెపాటి పిచ్చేశ్వరరావు, విన్నకోట శంకర్, పత్తిపాటి రత్నం, అమ్మవారి పుట్టింటి వారసులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అందరివాడు

ఏఎస్పీ మోకా సత్తిబాబు



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న ఏఎస్పీ మోకా సత్తిబాబు

పెడన: రాజ్యాంగాన్ని రూపొందించి సామాజిక న్యాయాన్ని అందించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరి వాడని అడిషనల్ ఎస్పీ మోకా సత్తిబాబు అన్నారు. ఆదివారం రాత్రి పెడన మండలం కొంకేపూడి పంచాయతీ పరిధిలోని ఈదుముడి గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. తొలుత ఏర్పాటు చేసిన సభలో పలువురు ప్రసంగించారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలు అమూల్యమైనవి అన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన కలలను సార్థకం చేయాల్సిన కనీసబాధ్యత మనందరిపై ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ఎస్సీ సంఘాల నాయకులు, పోలీస్ అధికారులు, వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. గ్రామ ప్రజలు ఈ విగ్రహ ప్రతిష్ఠాపనను ఎంతో ఉత్సాహంగా జరిపారు. ఈ కార్యక్రమం విజయవంతంగా జరగడంలో పాలక మండలి, గ్రామ పెద్దలు, యువత ముఖ్య పాత్ర పోషించారు.

రెండో రోజు శిక్షణ

ఘంటసాల: స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో హైదరబాద్‌కు చెందిన జాతీయ మత్స్య అభివృద్ధి మండలి సహకారంతో గ్రామీణ యువతకు అలంకరణ చేపల పెంపకం, యాజమాన్య పద్ధతులపై నిర్వహిస్తున్న శిక్షణ ఆదివారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మత్స్య పాలిటెక్నిక్ కళాశాల నుంచి ఉపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా వివిధ రకాల ఆక్వేరియం, వివిధ పోషకాహారాలు అలంకరణ చేపల పెంపకంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని, నీటి నాణ్యత ప్రమాణాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే మత్స్య శాస్త్రవేత్త జె.యశ్వంత్ కుమార్, అతిథి ఉపాధ్యాయులు, గ్రామీణ యువత పాల్గొన్నారు.

60 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



అవనిగడ్డ: నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన 60 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ రూ.53.90 లక్షల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులకు ఈ చెక్కులను అందించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకూ 176 మందికి రూ.1.46 కోట్ల విలువైన చెక్కులను అందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా వెంచర్





బందరు వెస్ట్‌లో శివగంగ వెనుక అనుమతులు లేకుండా వెంచర్ పనులు

ఓ టీడీపీ నాయకుని నిర్వాహకం

మచిలీపట్నంటౌన్: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మచిలీపట్నం నియోజకవర్గంలో ఆయా పార్టీల నాయకుల అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది.

విషయం ఇదీ..

నగరంలోని బందరు వెస్ట్ శివగంగ గుడి వెనుక ప్రాంతంలో ఆ ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకుడు అనధికార లే అవుట్ పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నా అటువైపు నగరపాలక సంస్థ, రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడకపోవటమే ఇందుకు నిదర్శనం. ఆ ప్రాంతంలోని వార్డు నంబర్– 1, 365/2 సర్వే నంబర్‌లో దాదాపు ఏడు ఎకరాల భూమిని గత 15 రోజులుగా చదును చేసి వెంచర్ నిర్మాణ పనులు చేపట్టారు. జేసీబీలతో రేయింబవళ్లు పనులు జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటాన్ని ప్రజలు తప్పు పడుతున్నారు. నగరపాలక సంస్థ, ముడా నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండానే వెంచర్ నిర్మాణ పులు నిర్వహిస్తుంటే సంబంధిత అధికారులు పట్టించుకోకపోవటం పట్ల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

కూటమిలో కీలక పార్టీలైన టీడీపీ, జనసేన పార్టీల నాయకులు బరితెగించి మరీ అడ్డగోలు పనులకు పాల్పడుతున్నా అధికారగణం గుడ్లప్పగించి చూడటం తప్ప ఎలాంటి చర్యలకు ఉపక్రమించే సాహసం చేయటం లేదు. ఆయా పార్టీల నాయకులు మంత్రి కొల్లు రవీంద్రకు అత్యంత సన్నిహితంగా ఉండటమే ఇందుకు కారణమనే వాదనలు వినవస్తున్నాయి. ఇదే కోవలో

బుసక మట్టితో మెరక..

నిర్మాణంలో ఉన్న వెంచర్‌కు సముద్ర తీరం నుంచి అనుమతులు లేకుండా టిప్పర్ల కొద్దీ మట్టిని తీసుకొచ్చి మెరకపనులు చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా టిప్పర్లతో అనధికార మట్టి తరలింపు జరుగుతున్నా అటు మైనింగ్, ఇటు రెవెన్యూ అధికారులు కళ్లప్పగించి చూస్తుండటం ఎంత వరకూ న్యాయమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

సామాన్యులైతే ఇలా..

పేద రైతులు తమ పొలంలో ఎత్తు పల్లాలను సరిచేసుకునేందుకే అనుమతులు తప్పని సరి చేసి ఇబ్బంది పెట్టే మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు వెంచర్ నిర్మాణానికి జేసీబీలతో చదును పనులు, మెరక పనులు జరుగుతుంటే పట్టించుకోకపోవటం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పరిశీలించి చర్యలు..

దీనిపై నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీహరి ప్రసాద్‌ను సాక్షి ప్రశ్నించగా వెంచర్ నిర్మాణంపై తమకు సమాచారం లేదని వెళ్లి పరిశీలించి చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు.

26న గౌడ సంఘం సర్వసభ్య సమావేశం

పెడన: పట్టణ గౌడ సంఘం సర్వసభ్య సమావేశం ఈ నెల 26న నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు, శ్రీగణపతి సాయి, శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానం కమిటీ అధ్యక్షుడు పడమట బలరాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు రాత్రి ఏడు గంటలకు ప్రభాత్ టాకీస్ ఆవరణలో జరిగే ఈ సమావేశంలో శ్రీరామనవి రోజున కల్యాణం పీటలపై కూర్చునే దంపతులు, కొబ్బరి చిప్పల వేలం నిర్వహణ, జమా ఖర్చులు తదితర వాటిపై సమీక్షి నిర్వహిస్తామన్నారు. కమిటీ సభ్యులతో పాటు గౌడ సంఘీయులంతా హాజరుకావాల్సిందిగా ఆయన కోరారు.

నేడు మహిళా సాధికారతపై సదస్సు

నాగాయలంక: స్థానిక రక్షణసైన్యం (సాల్వేషన్ ఆర్మీ)ఆధ్వర్యంలో నాగాయలంక బోస్ బొమ్మ సెంటర్‌లోని సంస్థ కార్యాలయం వద్ద సోమవారం సమాజం, మహిళా సాధికారతపై ప్రత్యేక సదస్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ జిల్లా అధికారి (డి.ఓ) మేజర్ తెలగతోటి ప్రసాదరావు ఆదివారం తెలిపారు. ఈ సదస్సుకు చెన్నైలోని తమ సంస్థ ప్రాజెక్ట్ ఆఫీసర్ మేజర్.డి.విజయ కుమార్, సీపీ కోర్డినేటర్ పి.జీవన్ రాయ్ ముఖ్యఅతిధులుగా హాజరవుతారు. మహిళా ప్రతినిధులుగా స్థానిక ఈఓపీఆర్డీ కె.అప్పలనరసమ్మ, మాధవి, టి.సౌజన్యజ్యోతి పాల్గొంటారు.

అన్నసమారాధన

మచిలీపట్నంటౌన్: నగరంలోని కాలేఖాన్‌పేటలో దేవీ నామచారమ్మ అమ్మ వారి సంబరాల్లో భాగంగా ఆదివారం అన్నసామారాధన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. అన్న సమారాధనలో భక్తులు వందలాదిగా తరలివచ్చి అమ్మ వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ నెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకూ అమ్మ వారి సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ భక్త బృందం ప్రతినిధులు పర్యవేక్షించారు.

కాలువ తవ్వకం పనులకు భూమి పూజ



కాలువ తవ్వకం పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, పక్కన నాయకులు

బంటుమిల్లి: బంటుమిల్లి ప్రధాన కలువ పరిధిలోని రైతులు ఇబ్బందులు పడకుండా వారి సంక్షేమం కోసమే పంట, మురుగు కాలువల మరమ్మతులు చేపట్టామని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని పెదపట్నం బ్రాంచి కాలువకు మెయిన్ కెనాల్ వద్ద ఆదివారం తవ్వకం పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీసీ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు దేవనబోయిన వెంకటేశ్వరరావు, వాసుపల్లి గణేష్, బంటుమిల్లి డీసీ చైర్మన్ బొర్రా కాశీ, పలు గ్రామాల నీటి సంఘాల చైర్మన్లు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కూనపరెడ్డి శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



పరీక్ష ప్యాడ్స్ స్వీకరించిన విద్యార్థులతో డాక్టర్ వేములపల్లి సురేష్, రోజా తదితరులు

చల్లపల్లి: ప్రతి ఒక్కరూ ఇష్టంతో చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ (ఐవీఎం) వ్యవస్థాపకుడు డాక్టర్ వేములపల్లి సురేష్ కుమార్ అన్నారు. ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు చదువుతున్న వివిధ గ్రామాలకు చెందిన 280 మంది పేద విద్యార్థులకు ఆదివారం పురిటిగడ్డలోని ఐవీఎం హోమ్ ఆవరణలో పరీక్ష ప్యాడ్‌లను సురేష్ ఆయన సతీమణి రోజా దంపతులు అందజేశారు. అందరూ శ్రద్ధగా చదువుకుని మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. విద్యతో పాటు ఉన్నత విలువలు, వినయం, విధేయత, క్రమశిక్షణ చిన్ననాటి నుంచే అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వేములపల్లి స్వితిన్‌రాస్, వేములపల్లి సోఫి ఐవీఎం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా పోతురాజుస్వామి నెల సంబరం

నాగాయలంక: గ్రామంలోని బోసుబొమ్మ సర్కిల్‌లో కొలువై ఉన్న శ్రీపోతురాజుస్వామి వార్షిక జాతర మహోత్సవంలో భాగంగా నెల సంబరం ఆదివారం కోలాహలంగా జరిగింది. పోతురాజుకు మొక్కుబడులు చెల్లించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటి పర్యవేక్షణలో నెల సంబరం సంప్రదాయాలకు అనుగుణంగా రజక పూజారులు ప్రత్యేక పూజలు జరిపి, చద్దినైవేద్యాలు స్వీకరించారు. అనంతరం భక్తులు తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. డప్పు నృత్యాలు, మేళతాళాలతో, నైవేద్యాల కావళ్లతో భక్తులు బంధు మిత్రులతో కలిసి భారీగా తరలివచ్చారు. పోలవరపు వెంకటకృష్ణ– శ్రీదేవి దంపతులు ప్రత్యేక సంప్రదాయక పూజ నిర్వహించారు. నిర్వాహక కమిటీ ప్రతినిధులు ఉప్పల లీలాకృష్ణ ప్రసాద్ (బుజ్జి) దంపతులు, కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో నెల సంబరం పూజాధికాలు జరిగాయి. తలశిల బాలకృష్ణ, బోయపాటి రాము, గడ్డిపాటి ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే చర్యలు

చల్లపల్లి: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమైన నేపథ్యంలో ఎవరైనా బెట్టింగులు ఆడినా.. ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇందుకోసం ప్రత్యేక నిఘా కూడా ఏర్పాటు చేశామని చల్లపల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎవరైనా.. ఎక్కడైనా బెట్టింగులు ఆడుతున్నట్లు తెలిస్తే ప్రజలు బాధ్యతగా వ్యవహరించి వెంటనే తమకు సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వారికి తగిన రివార్డులు కూడా ఇస్తామని చెప్పారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా చక్కగా చదువుకుని తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఎస్ఐ సుబ్రహ్మణ్యం ఆకాంక్షించారు.

స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళి

గుడివాడ టౌన్: భారతదేశాన్ని బ్రిటిష్ పాలకుల నుంచి విడిపించేందుకు తమ ప్రాణాలనే ఫణంగా పెట్టిన స్వాతంత్ర సమరయోధులు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు అని సీపీఎం నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు వర్థంతి నిర్వహించారు. తొలుత వారి చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర సమరంలో ధీరులుగా పోరాడి ఉరితాళ్లను చిరునవ్వుతో స్వాగతించిన గొప్ప యోధులు అని కొనియాడారు. యువత వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి, సీఐటీయూ కార్యదర్శి లక్ష్మణరావు, టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లంకపల్లి లాజరు పాల్గొన్నారు.